
అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 97 | సోమవారం 13 జూలై 2026 | పేజీలు : 4 | వెల : 3/-





# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది

పవన్‌ను అవమానిస్తున్నారు.. కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు

ధవళేశ్వరం బ్యారేజీకి 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు

పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు






**(అంకుశం, కొత్తపేట/ఆత్రేయపురం, జులై 13):**

గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. - మిగతా2లో

# పేరుకుపోయిన చెత్తని 10 రోజుల్లో తొలగించండి

## అధికారులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశాలు



**(అంకుశం, విజయవాడ, జులై 13):**

ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ) పరిధిలోని విజయవాడ ఆటో నగర్ ప్రాంతంలో 'చెత్త సేకరణ, బదిలీ కేంద్రం' (గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్) ఏర్పాటుకు అనువైన ఖాళీ స్థలాన్ని గుర్తించాలని ఏపీఐఐసీ, ఐఏఎల్ఏ అధికారులను స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సమగ్ర లేఅవుట్ ప్లాన్, ఇంజనీరింగ్ డిజైన్, అంచనా వ్యయం, ఇతర ప్రాజెక్ట్ పత్రాల తయారీకి సాంకేతిక సహాయం కోరుతూ ఏపీఐఐసీ సంస్థ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదన పంపాలని చెప్పారు. విజయవాడ ఆటోనగర్ లోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణపై సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోనగర్ లో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని చైర్మన్ పట్టాభిరామ్ అధికారులను ఆదేశించారు. - మిగతా2లో

# పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి 36 ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు

మూడేళ్లలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని నిర్ణయం

ప్రాజెక్టుల కోసం రూ.35,313 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం

జలధార పనులకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు విడుదల చేయాలని ఆదేశం

1023 సాగునీటి పథకాల పునరుద్ధరణకు ఏపీఎస్ఐడీసీకి బాధ్యతలు



**(అంకుశం, విజయవాడ, జులై 13):**

సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సోమవారం ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్‌లోని గ్యాప్ 1, గ్యాప్ 2తో పాటు పవర్ హౌస్ నిర్మాణ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, ప్రాజెక్టు ప్రదేశం నుంచే రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ వర్చువల్ సమీక్షలో వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకోసం రూ.35,313 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పనుల పురోగతి సహా ఇతర ప్రాజెక్టుల వివరాలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. - మిగతా2లో

# పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స

మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు

ఆదివారం పవన్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు - మిగతా2లో

## భరతనాట్యంలో మెరిసిన కృతికకు ఘన సన్మానం



**అంకుశం న్యూస్ ఉరవకొండ జూలై 13 :** భరతనాట్య శాస్త్రీయ నృత్యంలో విశేష ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్న ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన కృతికాకు గ్రామస్థులు ఘన సన్మానం నిర్వహించారు. పెన్నాహోబిలం ఆలయ మాజీ చైర్మన్ ముత్తులూరి అశోక్ కుమార్ మేనకోడలైన కృతికా ఇటీవల చిక్కబళ్లాపురంలోని కన్నడ భవన్‌లో నిర్వహించిన అరంగేట్రం కార్యక్రమంలో అమెరికా నుంచి వచ్చి అద్భుత నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సోమవారం రాకెట్ల గ్రామంలోని ముత్తులూరి అశోక్ కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాట్లాడుతూ, భారతీయ శాస్త్రీయ నృత్య కళను విదేశాల్లోనూ ప్రోత్సహిస్తూ కృతికా తన ప్రతిభను చాటుకోవడం అభినందనీయమన్నారు. ఆమె సాధించిన ఈ విజయం గ్రామానికి, ఉరవకొండ ప్రాంతానికి, అనంతపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి తెలుగు ప్రజలకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కృతికాకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కృతికాకు అభినందనలు తెలిపారు.

## గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

-మొదటిపేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రొత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన చెత్తని 10 రోజుల్లో తొలగించండి

-మొదటిపేజీ తరువాయి

ఈ ప్రతిపాదిత గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తాత్కాలిక సేకరణ, చెత్త వేర్వేరుగా విభజించే కేంద్రంగా పనిచేస్తుంది. ఇక్కడ సేకరించిన చెత్తను కాంపాక్టర్ల ద్వారా జిందాల్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలిస్తారు. ఈ అత్యాధునిక బదిలీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన లేఅవుట్, ప్రణాళిక, డిజైన్, సాంకేతిక అంశాల రూపకల్పనలో సహాయపడేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఇంజనీరింగ్ బందాన్ని పంపిస్తుందని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. వీధి వీధిలో దుకాణాల వెంట తిరిగి చెత్త సేకరించే సాధారణ టిప్పర్ కార్యకలాపాలకు బదులుగా, పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి 'ఎలక్ట్రిక్ వాహనాలను' వినియోగించవచ్చని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ సూచించారు. సర్వీస్ మోడల్ లో అనుభవం కలిగిన ఏజన్సీల నుంచి వాహనాలను తీసుకుని అద్దె చెల్లించవచ్చని, తద్వారా మున్సిపల్ ఘన వ్యర్థాల సేకరణ సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ సీజీఎం ఐఎల్ రామ్, ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, జోనల్ మేనేజర్ అండ్ కమిషనర్ బాబ్జీ, డిప్యూటీ జోనల్ మేనేజర్లు ఎం.దొరబాబు, జి.జ్యోతి, ఫైనాన్స్ మేనేజర్ జి.బాలమ్మ, మేనేజర్ (ఇంజనీరింగ్) ఎండీ ఇస్మాయిల్ బేగ్, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏఎంహెచ్ఓ గోపాల నాయక్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, శానిటరీ ఇనస్పెక్టర్ సుధాకర్, కాంపాక్టర్ మెయింట్ నెన్స్ టీమ్ ఇన్ చార్జి నూతక్కి రామమోహన్, ఆటోనగర్ ఐఏఎల్ఏ మాజీ అధ్యక్షులు ఎస్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి 36 ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

-మొదటిపేజీ తరువాయి

అదేవిధంగా, ఏపీఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ) ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రూ.3,883 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనుల ద్వారా సుమారు 8.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా నీరందుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో పాటు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ఆధునీకరణ కింద మన్యం, విజయనగరం జిల్లాల్లో ప్రత్యేక పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. భూగర్భ జలాలను పెంచేందుకు ఉద్దేశించిన 'జలధార' కార్యక్రమంపై కూడా సీఎం సమీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు, ఫీడర్ ఛానళ్లను అభివృద్ధి చేసినట్లు అధికారులు వివరించారు. ఈ పనులను వీబీజీ రామ్ జి సంస్థ ద్వారా చేపట్టాలని, జలధార పనుల కోసం ప్రతి జిల్లాకు తక్షణమే రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించారు. కాగా, ఈ ఏడాది దేశంలోనే అత్యధికంగా రూ.2500 కోట్లను ఉపాధి హామీ పథకం కింద ఖర్చు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తెచ్చారు.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

-మొదటిపేజీ తరువాయి



విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన సాంకేతికతలు యుద్ధ స్వరూపాన్ని మారుస్తున్నప్పటికీ, అంతిమంగా విజయాన్ని నిర్ణయించేది సంప్రదాయ సైనిక సామర్థ్యాలు, శిక్షణ పొందిన సైనికులు, దేశ సంకల్పమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. నేడు విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' యుద్ధనౌకను నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవిష్యత్ యుద్ధాలు ఏఐతో జరగవచ్చేమో గానీ, వాటిని గెలిచేది మాత్రం మన సైనికులు, విశ్వసనీయ సైనిక బలంతోనేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "నూతన సాంకేతికతలు యుద్ధ స్వభావాన్ని మార్చిన మాట వాస్తవమే. కానీ, సంప్రదాయ యుద్ధ సామర్థ్యాల ప్రాధాన్యతను అవి ఏమాత్రం తగ్గించలేదు. యుద్ధం ప్రాథమిక సూత్రాలను నెరవేర్చడానికి బలమైన సంప్రదాయ సామర్థ్యాలు నేటికీ ఎంతో అవసరం. కేవలం కొత్త టెక్నాలజీపై ఆకర్షణతో సంప్రదాయ సైనిక శక్తిని నిర్లక్ష్యం చేసిన దేశాలు భారీ మూల్యం చెల్లించుకున్నాయని చరిత్ర మనకు గుర్తుచేస్తోంది" అని వివరించారు. నూతన టెక్నాలజీ, సంప్రదాయ వేదికలు ఒకదానికొకటి పోటీ కాదని, అవి పరస్పర పూరకాలు అని రక్షణ మంత్రి తెలిపారు. "ఒక సంప్రదాయ వేదిక కొత్త టెక్నాలజీ లేకుండా బలహీనపడుతుంది, అదే సమయంలో టెక్నాలజీకి ఒక వేదిక అవసరం. అందుకే, రెండు రంగాల్లోనూ రాణిస్తూ, వాటి మధ్య సమతుల్యం పాటించాలనేది భారత విధానం. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతూనే, మన సంప్రదాయ సామర్థ్యాలను నిరంతరం పదునుపెట్టుకుంటాం. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఈ సంకల్పానికి, నిబద్ధతకు ప్రతీక" అని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' వంటి సైనిక చర్యలు.. సంప్రదాయ, ఆధునిక సామర్థ్యాలను సమర్థవంతంగా మేళవించగల భారత శక్తిని నిరూపించాయని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. ఆత్మరక్షణకే కాకుండా అవసరమైనప్పుడు శత్రువుపై నిర్ణయాత్మకమైన దెబ్బకొట్టి, వారిని పూర్తిగా నిర్మూలించగల సత్తా భారత్‌కు ఉందని ఈ ఆపరేషన్ రుజువు చేసిందని పేర్కొన్నారు. యుద్ధనౌకల నిర్మాణం కేవలం నౌకాదళాన్ని బలోపేతం చేయడమే కాదని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఒక యుద్ధనౌక నిర్మాణం అంటే ఒక పరిశ్రమల వ్యవస్థను నిర్మించడమే. ఉక్కు, ఎలక్ట్రానిక్స్, సెన్సార్లు, ప్రొపల్షన్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్, లాజిస్టిక్స్ వంటి ఎన్నో రంగాలను ఇది ముందుకు నడిపిస్తుంది. దీనివల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది, కొత్త టెక్నాలజీలు అభివృద్ధి చెందుతాయి, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది" అని తెలిపారు. భారత్‌ను నౌకా నిర్మాణ రంగంలో గ్లోబల్ హబ్‌గా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనికోసం 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'పై వేగంగా పనిచేస్తున్నామని చెప్పారు. మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్, షిప్‌బిల్డింగ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్ వంటి పథకాల ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

## వియత్నాంలో ఘోర ప్రమాదం..

వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ న్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉద్ధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఒక మొబైల్ కంపెనీ తరఫున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో ఆంధ్రప్రదేశ్?కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. మృతుల్లో మచిలీపట్నంకు చెందిన డిస్ట్రిబ్యూటర్ గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు. గిల్లి కిశోర్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం. కడపకు చెందిన నయీమ్ అనే డిస్ట్రిబ్యూటర్ ఆ బోటు ఎక్కకపోవడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొత్తం ఐదు బోట్లలో పర్యాటకులు విహారానికి వెళ్లగా, అందులో ఒక బోటు ప్రమాదానికి గురైంది. ఈ విషాద ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది. ప్రమాదాన్ని ధ్రువీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన కార్యాలయం, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొంది. బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను (084 36 281 7930, 084 91 552 37 14, 084 33 452 0414, 084 91 308 9165) కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

## 17 ఏళ్లకే అరుదైన గౌరవం.. 300 మంది అమెరికా నేవీ క్యాడెట్స్‌కు లీడర్‌గా భారత సంతతి విద్యార్థిని

**యూఎస్ నేవీ కెడెట్ ప్రోగ్రాంలో భారత సంతతి యువతికి అరుదైన గౌరవం**

**17 ఏళ్ల రిధి చౌహాన్.. 300 మంది విద్యార్థుల బెటాలియన్‌కు కమాండింగ్ ఆఫీసర్**

**న్యూయార్క్‌లోని హైస్కూల్‌లో అత్యున్నత క్యాడెట్ ర్యాంకు సాధించిన విద్యార్థిని**

**రాజస్థాన్ మూలాలున్న రిధి.. భవిష్యత్తులో నేవల్ ఆఫీసర్ కావడమే లక్ష్యమని వెల్లడి**

అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ యువతి చిన్న వయసులోనే అరుదైన ఘనత సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. 17 ఏళ్ల రిధి చౌహాన్, న్యూయార్క్‌లోని ఓ హైస్కూల్‌లో నేవీ జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్ (ఎన్‌జేఆర్ఓటీసీ) ప్రోగ్రాంలో అత్యున్నత క్యాడెట్ ర్యాంకును కైవసం చేసుకుంది. సుమారు 300 మంది విద్యార్థులున్న బెటాలియన్‌కు 'బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్'గా బాధ్యతలు చేపట్టింది. క్వీన్స్‌లోని బెంజమిన్ ఎన్. కార్డోజో హైస్కూల్‌లో ఈ గౌరవం దక్కించుకుంది. ఈ ఉన్నత పదవిలో భాగంగా రిధి వారానికి నాలుగు రోజులు తన బెటాలియన్‌లోని క్యాడెట్ల డ్రిల్ ప్రాక్టీస్, శిక్షణ, కార్యకలాపాలు, సంక్షేమాన్ని పర్యవేక్షిస్తుంది. ఇందుకోసం తరచుగా ఉదయం 7 గంటల కన్నా ముందే పాఠశాలకు చేరుకుంటుంది. యూఎస్ నేవీ సహకారంతో నడిచే ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం. ఈ పదవిని చేపట్టడం ద్వారా ఈ ప్రోగ్రాంలో విద్యార్థి నాయకత్వానికి అత్యున్నత శిఖరానికి చేరినట్టయింది. ఈ స్థాయికి రావడానికి ముందు రిధి అకడమిక్ కమాండర్, స్టెమ్ (ఎస్‌టీఈఎం) కమాండర్, ప్లాటూన్ లీడర్ వంటి పలు కీలక హోదాల్లో సమర్థవంతంగా పనిచేసింది. ఆమె అకడమిక్ కమాండర్‌గా ఉన్నప్పుడు, పాఠశాల బృందం వరుసగా రెండేళ్లు జాతీయ స్థాయి లీడర్‌షిప్ అండ్ అకడమిక్ బౌల్ రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. స్టెమ్ కమాండర్‌గా, యూనిట్ కోసం మొట్టమొదటి 'సీపెర్చ్' అనే అండర్‌వాటర్ రోబోట్‌ను నిర్మించడంలో క్యాడెట్లకు నాయకత్వం వహించింది. తన పదవీకాలంలో 200 మందికి పైగా తోటి క్యాడెట్లకు మార్గనిర్దేశం చేసింది.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



**అంకుశం న్యూస్ ఉరవకొండ జులై 13 :** స్థానిక ఎస్.కే. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1987--89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇంటర్ విద్యార్థులకు సోమవారం కళాశాలలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఏడాది ఎస్.కే. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.5,000, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.2,500 చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పూర్వ విద్యార్థులు సూచించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాళ్లు కృష్ణమూర్తి, పాపావలి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా సాకే భాస్కర్‌తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని కళాశాల అభివృద్ధికి తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై 98 శాతం పూర్తి చేసాం.. ఎమ్మార్వో. దేవరాజ్.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 13** మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలలో గల గ్రామాలలో మొత్తం ఓటర్లు 34,848 ఉన్నారని, ఎస్ ఐ ఆర్ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూలై 13 వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు 32,652 ఎస్ ఐ ఆర్ పూర్తి చేయడం జరిగిందని. దీంతో 98 శాతం నమోదు కావడం జరిగిందన్నారు. ఇంకనూ 705 ఓటర్లను సోమవారం రాత్రి లోపల పూర్తి చేయగలమని వారు తెలిపారు. ఎస్ ఐ ఆర్ నివేదికలను జిల్లా కలెక్టర్ కు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో సురేష్ బాబు పాల్గొన్నారు.

## గడువులోపు ఎస్ఐఆర్ సమగ్ర నివేదిక తప్పక తయారు చేయాలి.

**ఎస్ ఐ ఆర్ కార్యక్రమ ఈ ఆర్ వో వెంకటేశు.**




**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 13** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని జులై 14 వ తేదీ లోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని నియోజకవర్గ ఈఆర్ఓ అధికారి వెంకటేశు తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని పలు పోలింగ్ స్టేషనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, వీఆర్వోలు ఎస్ ఐ ఆర్ ప్రొఫార్మా పూరించే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అంతేకాకుండా ఇంకను ఎంతమంది ఓటర్లు ఉన్నారు? వారు ఓటర్ల వివరాల తెలిపే ఫారాలు వారికి అందాయా? లేదా? అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా సాధ్యమైనంతవరకు సోమవారం రాత్రి లోపు పూర్తి చేయాలని వారు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలను తెలుపుతూ ధర్మవరం అర్బన్ లో 1,06,554 ఓటర్లు ఉండగా జూలై 13 వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నాటికి ఎస్ఐఆర్ కార్యక్రమంలో 1,04,241 పూర్తి చేశామని, ఇందుకుగాను 98% నమోదు కావడం జరిగిందన్నారు. అలాగే రూరల్ లో 34,848 ఓటర్లు ఉండగా 34,143 పూర్తి చేసామని, 98 శాతము పూర్తి చేసామని, తాడిమర్రి లో 25,785 ఓటర్లకు గాను 25,449 పూర్తి చేయగా 99 శాతం పూర్తి అయ్యిందని, ముదిగుబ్బలో 48,287 ఓటర్లకు గాను 46,223 పూర్తి అయ్యాయని 96 శాతము పూర్తి అయిందని, బత్తలపల్లి లో 32,711 ఓటర్లకు గాను 32,321 పూర్తి చేశామని 99 శాతము నమోదు చేయడం జరిగిందన్నారు. మొత్తము నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో ఓటర్లు 2,48,185 ఓటర్లు ఉండగా 2,42,377 పూర్తి చేశామని హిందువుగాను 98 శాతం పూర్తి చేశామని తెలిపారు. వీలైతే సోమవారం రాత్రి లోపల పూర్తి చేయగలమని వారు తెలిపారు. మొత్తం మీద జులై 14 వ తేదీ లోపు ఎస్ఐఆర్ కార్యక్రమం కచ్చితంగా పూర్తి చేస్తామని వారు తెలిపారు.

## తిరుపతి టీడీపీ కొత్త ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాపునాడు జిల్లా అధ్యక్షులు ఇటికింటి మహేష్



**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 13** ఇటీవల తిరుపతి తెలుగుదేశం పార్టీ కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన జేబీ శ్రీనివాస్ గారిని జనసేన పార్టీ సీనియర్ నాయకులు, కాపునాడు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఇటికింటి మహేష్ మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే అంశంపై పలు విషయాలు చర్చించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాపునాడు రాయలసీమ అధ్యక్షులు పూల పాండురంగయ్య, దండు హరీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# రూ.150 కోట్లతో ధవళేశ్వరం బ్యారేజి 117 గేట్ల ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు

### గోదావరి డెల్టా రైతాంగానికి ప్రాణం పోసింది నాడు కాటన్ అయితే నేడు చంద్రబాబు






**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 13:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాతగా, రైతు పక్షపాతిగా, అధికారం అంటేనే బాధ్యతగా పేద ప్రజలకు సేవ చేయడానికి భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తూ నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. ధవలేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 117 నూతన గేట్ల ఏర్పాటు, మరమ్మత్తు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత రైతులు చేసుకున్న అదృష్టమని ఎమ్మెల్యే బండారు కొనియాడారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పిచ్చుకలంకలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి సభలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, తన సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ప్రసంగిస్తూ రైతు ఇరిగేషన్ శాఖామంత్రిగా ఉంటే ఆ శాఖ అద్భుతమైన పనితీరు కనబరుస్తుందని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ప్రత్యేకంగా ప్రశంసించారు. నాడు కాటన్ మహాశయుడు సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు అన్నం పెడితే,ఈ బ్యారేజీని కాపాడటానికి నేనున్నాను అంటూ 117 గేట్ల ఆధునికీకరణ పనులు రూ.150 కోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టారని, ఈ ప్రాంత ప్రజల పట్ల రైతుల పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాలకు ఇది నిదర్శనమన్నారు. వైసిపి గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో బ్యారేజ్ గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని, బేరింగ్లు కూడా బిగించలేదని, చిన్న చిన్న మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడంతో బ్యారేజీ అస్తిత్వమే ప్రమాదంలో పడిందన్నారు. ఈ అంశాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్యారేజీకి ఎటువంటి ప్రమాదం జరగకూడదు, గోదావరి డెల్టా రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఆలోచనతో బ్యారేజీ ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతాంగం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టిసీమతో కృష్ణ డెల్టాకు ఊపిరి పోసారన్నారు. వెలుగోడు నిర్వాసితులకు పరిహారం అందజేసారన్నారు. పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నారని ప్రశంసించారు. నీటిపారుదల రంగానికి, రైతుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పరిపాలనలో రాష్ట్రంలో చేసిన ఆర్థిక అని విధ్వంసాన్ని, అరాచకాలను సరిదిద్దడానికి తన అపారమైన అనుభవంతో అనునిత్యం ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారని, రాష్ట్రాన్ని చక్కదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. సెంట్రల్ డెల్టాను కాపాడడానికి లొల్ల లాకుల పునర్నిర్మాణానికి నిధులు కోరితే వెంటనే రూ.74.20 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అభివన కాటన్ దొరలా, అపర భగీరథునిలా గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు సైతం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కాటన్ ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను కాపాడే శక్తి ముఖ్యమంత్రి చంద్రబాబుకి మాత్రమే ఉందన్నారు. బిందు సేద్యం, ప్రకృతి సేద్యం, వ్యవసాయ ఆధునీకరణ అన్నదాత సుఖీభవ మొదలైన పథకాలతో అన్నదాతలకు అండగా నిలుస్తున్నార న్నారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వాడపల్లి దేవస్థానం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే బండారు కోరారు. అలాగే పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఏటిగట్ల బలోపేతానికి నిధులు కేటాయించాలని, నదీపాత నివారణకు, కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ కు సంబంధించిన స్థలం కేటాయింపు, కొత్తపేట ఎమ్మార్వో కార్యాలయం నిర్మాణానికి నిధుల కేటాయింపు, వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. పేరూరు వై జంక్షన్ నుంచి రావులపాలెం జాతీయరహదారి వరకూ మధ్యలో ప్రతిపాదించిన జాతీయ రహదారిని త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఈ పనులన్నీ చేపడతానని సానుకూలంగా స్పందించారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

-- జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్



**అంకుశం న్యూస్ లేపాక్షిజూలై 13:** శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ సోమవారం చిలమత్తూరు, లేపాక్షి తహసిల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సహాయ ఓటర్ల నమోదు అధికారులు (ూాజు=ాం), ఎలక్షన్ సూపర్ వైజర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ా×=) ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల నాణ్యతను జేసీ స్వయంగా పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించారు.

## తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి వజ్రాలతో కూడిన బంగారు హారం విరాళం



**అంకుశం న్యూస్ తిరుమల జూలై 13** విజయనగరానికి చెందిన భక్తుడు శ్రీ శ్రీనివాస సోమవారం తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారికి సుమారు 56.8 గ్రాముల బరువున్న వజ్రాలతో కూడిన బంగారు హారాన్ని ఆలయ అధికారులకు విరాళంగా సమర్పించారు. ఈ హారం విలువ సుమారు రూ.12.50 లక్షలు. ఆలయ అధికారులు దాతకు వేదాశీర్వచనం అందించి, శ్రీ పద్మావతీ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ లు సురేష్, రమేష్, మునిచెంగల్ రాయులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ చలపతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మడకశిర మండలం బుల్లసముద్రం వద్ద ఉన్న సూర్య విద్యానికేతన్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలనీ

ఎవశీ భాస్కర్ కు ఏ ఎస్ ఎఫ్ నాయకులు వినతి

పాఠశాల సమయంలోనే మరో భవన నిర్మాణం చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

సూర్య పాఠశాలలో విద్యార్థులు ఉన్న సమయంలోనే భవన నిర్మాణ పనులు నిర్వహిస్తున్నందున తక్షణ చర్యలు తీసుకోవాలని వినతి



**అంకుశం న్యూస్ మడకశిర జూలై. 13** ఈ సందర్భంగా ాుాఖీ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ సూర్య పాఠశాలలో విద్యార్థులు తరగతులకు హాజరవుతున్న సమయంలోనే పాఠశాల ప్రాంగణంలో భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. నిర్మాణ పనుల వల్ల దుమ్ము, శబ్ద కాలుష్యం, నిర్మాణ సామగ్రి మరియు యంత్రాల రాకపోకల కారణంగా విద్యార్థుల ఆరోగ్యం మరియు భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. పాఠశాల ప్రాంగణంలో చిన్నారులు ఉన్న సమయంలో నిర్మాణ పనులు నిర్వహించడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించవలసిందిగా కోరారు. సంబంధిత పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల భద్రతకు ఎలాంటి ప్రమాదం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నిర్మాణ పనులను విద్యార్థులు లేని సమయంలో నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఈఐఎస్ఎఫ్ నాయకులు నరసింహమూర్తి, బద్రి, నాయకులు పాల్గొన్నారు

## ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రిఎన్ఎండి ఫరూక్.




**అంకుశం న్యూస్ నంద్యాల్ జులై13** నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలోని ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల మహా శిబిరంను రాష్ట్ర న్యాయశాఖ, మైనారటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సహకారంతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక చొరవతో ఈ ఉచిత క్యాన్సర్ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

సుమారు రూ. 15,000 విలువైన క్యాన్సర్ పరీక్షలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని, ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను జయిద్దాం అనే నినాదంతో, క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారన్నారు . 30 ఏళ్ళ పైబడిన మహిళలు, చెడు అలవాట్లు ఉన్నవారు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారు ఈ సంచార క్యాన్సర్ స్క్రీనింగ్ వాహన సదుపాయాన్ని వినియోగించుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని, నయం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు .

ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, సెంట్రల్ ఫుడ్ కమిషన్ నెంబర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి , రాయలసీమ విద్యార్థి సంఘం వ్యవస్థాపకులు సీమ కృష్ణ , యం. వి.రమణారెడ్డి, వసుంధర దేవి, పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కదిరి నేల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన యువ క్రీడాకారులకు ఘన సన్మాన సభ



అంకుశం న్యూస్,కదిరి,జూలై:13: మన క్రీడాకారుల విజయం మన కదిరి గర్వకారణం, క్రీడాకారులు,క్రీడా అభిమానులు, యువత,విద్యార్థులు, తల్లిదండ్రులు,ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, క్రీడాకారులకు ఘన సన్మానం చేయాలని కదిరి ఎమ్మెల్యే 14.7.2026 మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్రీ కందికుంట వెంకటప్రసాద్ ఇండోర్ స్టేడియం లో క్రీడాకారులకు ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్,జిల్లా ఐపీఎస్ సతీష్ కుమార్ పాల్గొంటారు. సన్మానం పొందనున్న క్రీడాకారులు కాటం ఈశ్వర్ సాయి -- భారత్ జట్టుకు ఎంపిక,హర్షిత్ వెంకటసాయి -- జాతీయ స్థాయి ర్యాంకర్ గా,మురారి -- ప్రతిభావంత యువ క్రీడాకారుడు ఎన్నికయ్యారు.

## నూతిమడుగు బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే అమిలినేని స్వంత నిధులతో మరమ్మత్తులు..



**అంకుశం న్యూస్, కంబదూరు, జూలై : 13** కంబదూరు మండలం నూతిమడుగు వద్ద పెన్నా నదిపై ఉన్న వంతెన గతంలో వర్షాలకు కొట్టుకుపోతే అక్కడ అనేక గ్రామాల ప్రజలకు ఉన్న దారి కావడంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు వాహనాలు వెళ్లే విధంగా బ్రిడ్జి వద్ద తాత్కాలిక నిర్మాణం చేయించారు..నూతన బ్రిడ్జి మంజూరు అయ్యే వరకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు తన స్వంత నిధులతో అక్కడ బ్రిడ్జి వద్ద నీరు పారేందుకు వీలుగా ఇరు వైపుల అడ్డుగా ఉన్న కంప చెట్లు, మట్టి, రాళ్ళను జేసీబీ ద్వారా తొలగించడమె కాకుండా రెండు వైపుల పైపులు కొట్టుకు పోకుండా కాంక్రీట్ బెడ్డింగ్ నిర్మాణం కూడా చేపట్టారు..దీంతో పేరూరు డ్యామ్ నుంచి నీళ్లు వచ్చిన బ్రిడ్జి డ్యామేజి కాకుండా ఉండేలా చర్యలు చేపట్టారు..నూతిమడుగు, అటు వైపు ఉన్న అనేక గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు లేకుండా ప్రయానించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు..

## అర్హులందరూ వెంటనే ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

**ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి**



**అంకుశం న్యూస్ విజయవాడ, జులై 13:** రాష్ట్రంలో ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ ఐ ఆర్-2026) ప్రక్రియ ముగింపు దశకు చేరుకుందని, అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు మరియు డిజిటలైజేషన్ దరఖాస్తులను సమర్పించడానికి జూలై 14 (మంగళవారం) ఆఖరి తేదీ అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈ గడువును మరికాస్త పొడిగించే ప్రసక్తే లేదని, జూలై 14 అర్ధరాత్రి 12 గంటలకు ఆన్‌లైన్ పోర్టల్ పూర్తిగా క్లోజ్ చేయబడుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మీ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓ) ఇంటింటికీ వచ్చినప్పుడు మీ వివరాలను సరిచూసుకోవచ్చనీ తెలిపారు. లేదా ఈ సి ఐ ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా కానీ, మొబైల్ యాప్ ద్వారా కానీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై 21న ఓటర్ల ముసాయిదా విడుదలవుతుందని వివరించారు. కావున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా, సాంకేతిక ఇబ్బందులు తలెత్తక ముందే అర్హులైన ప్రజలు, యువత వెంటనే తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆకుల శ్రీనివాస్ కోరారు.

## సోమవారం,మాసశివరాత్రి,ఆరుద్ర కలిసిరావడంతో శివాలయాల్లో ప్రత్యేక పూజలు

**విశేష రోజున శివుడికి విశేష పూజలు నిర్వహించిన భక్తులు**



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 13:** శివోహం, హోంనమశివాయ అంటూ మారుమోగిన శివాలయాలు ఆరుద్ర నక్షత్రం, మాసశివరాత్రి పర్వదినం ఒకేసారి రావడంతో అనపర్తి పాత ఊరిలో వేంచేసి ఉన్న పురాతన శ్రీ ఉమా రామలింగేశ్వర ఆలయం సోమవారం భక్తజన సందోహంతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయకమిటీ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి ఉదయాన్నే ఆలయానికి చేరుకుని శివలింగానికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కానీ రామలింగేశ్వర శర్మ అర్చకబృందం ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, విశేష అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కామేష్ శర్మ మాట్లాడుతూ...చతుర్దశి, ఆరుద్ర నక్షత్రం కలయిక సోమవారంనాడు రావడం అత్యంత పవిత్రమైన యోగమని, శివలింగార్చన, బిల్వదళ సమర్పణ, “ఓం నమఃశివాయ” జపం చేయడం విశేష పుణ్యఫలాలను ప్రసాదిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాస రెడ్డితో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# అనంతలో ఎస్ఐఆర్ పై ప్రత్యేక డ్రైవ్

**85.12 శాతం అప్లోడ్ చేయడం జరిగింది..**

**– : జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..**




**అంకుశం న్యూస్అనంతపురం, జులై 13:** – అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 11, 12వ తేదీలలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ రెండవ రోజు ఆదివారం కూడా చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయడానికి, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పూరించడంలో వారికి సహకారం అందించి, పూరించిన వాటిని కలెక్షన్ ద్వారా బిఎల్ఓకి అందేలా చర్యలు తీసుకోవడం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. – మొదటిరోజు శనివారం విజయవంతంగా ప్రత్యేక డ్రైవ్ పూర్తి కావడం జరిగిందని, ఈరోజు ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్ కొనసాగిందని, పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్ఓలకు అందజేయడం, వాటిని అప్లోడ్ చేయడం జరిగిందని తెలిపారు. తీసుకున్న ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్ఓలు డిజిటలైజేషన్ ను ఏరోజుకు ఆరోజు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. – జిల్లాలో ఉన్న 2,226 పోలింగ్ కేంద్రాల పరిధిలో బిఎల్ఓలతో పాటు డిఆర్డిఏ, మెప్మా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఐ.అండ్.పీఆర్, ఆయా శాఖల సిబ్బంది ఇందులో పాల్గొన్నారన్నారు. బూత్ స్థాయి అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం, ఫారాలను పూరించేందుకు సహకరించడం చేసి, పూరించిన వాటిని బిఎల్ఓకి అందేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. – అలాగే అనంతపురం అర్బన్ పరిధిలో ఒక్కో బిఎల్ఓకు అదనంగా ఐదు మంది సిబ్బందిని కేటాయించి, బిఎల్ఓతోపాటు అదనంగా కేటాయించిన సిబ్బంది అందరూ ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పూరించడంలో వారికి సహకారం అందించి, పూరించిన వాటిని కలెక్షన్ ద్వారా బిఎల్ఓకి అందేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈరోజు ఆదివారం కూడా ఆయా శాఖల సిబ్బంది అందరూ వారి పరిధిలో వీలైనంతమంది ఓటర్లతో ఎన్యుమరేషన్ ఫారాలను నింపేలా చేసి వాటిని బిఎల్ఓలకు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి వారిని కూడా సర్ కార్యక్రమంలో విస్తృతంగా భాగస్వాములు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిర్లక్ష్యం వహించే అధికారులు బిఎల్వోలపై చర్యలు తప్పక ఉంటాయని తెలిపారు.

**ఎస్ఐఆర్ కింద ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి తీసుకుని 85.12 శాతం అప్లోడ్ చేయడం జరిగింది**

– ఎస్ఐఆర్ – 2026 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 20,38,523 ఎన్యుమరేషన్ ఫారాలను అనగా పూర్తిగా 100 శాతం పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జూన్ 15వ తేదీ నుంచి బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లాలో 2,226 మంది బిఎల్ఓలు ఉండగా, అందులో అందరు బిఎల్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 20,38,523 ఓటర్లు ఉన్నారని, అందులో ఇప్పటివరకు పూర్తిగా 100 శాతం అనగా 20,38,523 మందికి ఎన్యుమరేషన్ ఫారాలను అందించడం జరిగిందన్నారు. అందులో శనివారం రోజు సాయంత్రం 6 గంటల వరకు 16,65,541 ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి తీసుకుని (81.70 శాతం) అప్లోడ్ చేయడం జరగగా, ఈరోజు ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా 17,35,243 ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి తీసుకుని 85.12 శాతం (డిజిటలైజేషన్) అప్లోడ్ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా కలెక్ట్ చేయాల్సిన 1,22,943 (06.03 శాతం) ఎన్యుమరేషన్ ఫారాలు ఉండగా, మొత్తం అన్ కలెక్టబుల్ తో కలుపుకుని 18,58,186 (91.15 శాతం) ఎన్యుమరేషన్ ఫారాలు ఉన్నాయన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా 15.06.2026 నుండి 14.07.2026 వరకు బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు చేసి రెండు ఎన్యుమరేషన్ ఫారాలు జరుగుతుంది మరియు అందులో ఒక పూరించిన ఎన్యుమరేషన్ ఫారం తిరిగి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బిఎల్ఏలు, రాజకీయ పార్టీలు సహకారాన్ని అందించాలన్నారు.

# నర్సరీకి 70 వేల ఫీజులా...





**అంకుశం న్యూస్, అనంతపురం, జూలై : 13** అనంత నగరం నడిబొడ్డున ఉన్న ట్రేలిస్ స్కూల్లో నర్సరీ, యూకేజీ,ఎల్కేజీ విద్యార్థులకు 70 వేల నుంచి 80 వేల రూపాయల వరకు ఫీజులు దండుకుంటున్నారని ఆరోపిస్తూ ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నేతలు ట్రేలిస్ స్కూల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ భారత దేశంలో ఎక్కడ లేని విధంగా కరువు జిల్లాలో కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థలు వీళ్ళకు వేల రూపాయలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ట్రేలిస్ స్కూల్ లో అయితే పాఠ్యపుస్తకాల పేరుతో ఎనిమిది పుస్తకాలు ఇచ్చి 4200 వందల రూపాయలను ఫీజు కట్టించుకొని ఆ పుస్తకాలను టవర్ క్లాక్ వద్ద ఉన్న జ్యోతి బుక్ స్టాల్ లో విక్రయించడం జరుగుతుందని, తాము స్వయంగా వెళ్లి పుస్తకాల పేరుతో ఉన్న పేపర్ను చూపిస్తే తమ సంబంధం లేవని, లేనిపోని సమాధానం చెబుతున్నారన్నారు. మార్కెట్ కంటే 3,4 రేట్లు అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయట దొరకని విధంగా ప్రత్యేకంగా పబ్లిషర్స్ పుస్తకం ప్రవేశపెట్టి విద్యా వ్యాపారానికి తెర లేపుతున్నారు. ట్రేలిస్ విద్యాసంస్థలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, బ్లేజర్ వంటి వస్తువులు అమ్ముతున్నారని ఇన్చార్జి డి ఈ ఓ కి ఫోన్లో ఫిర్యాదు చేయగా తాము వస్తున్నామని చెప్పి, రెండు గంటలు ధర్నా నిర్వహించిన ఏ విద్యాశాఖ అధికారి కూడా ట్రేలిస్ స్కూల్ వైపు కన్నెత్తి చూడలేదు అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలు ఇస్తున్న మామూలు మత్తులో మునిగి తేలుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కాలం చెందిన బిల్డింగులు స్కూల్ నడుపుతూ విద్యను వ్యాపార దేయంగా మూడు పూలు ఆరు కాయలు లాగా ఇటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతుందని హేద్దేవా చేశారు. డి ఈ ఓ స్పందించక పోతే కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలియజేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర కార్యదర్శులు సతీష్ చౌదరి, వెలుగు ప్రశాంత్, జిల్లా కార్యదర్శులు విజయ్,రాజేష్, పోలార్డ్ నరేష్,చంద్ర రెడ్డి,కౌండిన్య, ప్రదీప్, ప్రభంజన్ రెడ్డి, సింహాద్రి, గోవర్ధన్, గోవింద్, తదితర విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు..

# కళ్యాణమ్మ ఆశయ సాధన..

# సమాజ సేవలో మాంటిస్సోరి ఎలీట్ విలక్షణ ముద్ర!




**రాప్తాడు అంకుశం న్యూస్ జూలై 13** కళ్యాణమ్మ ఆశయ సాధనకోసం సమాజ సేవకు నిరంతరం కృషి చేస్తామని ఎండి కృష్ణ భరత్ కరస్పాండెంట్ కృష్ణ సమీరా అన్నారు. మాంటిస్సోరి పాఠశాలల వ్యవస్థాపకురాలు స్వర్గీయ కళ్యాణమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని గొల్లపల్లి మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల ఆవరణలో సోమవారం మెగా వైద్య, రక్తదాన శిబిరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సే ధ్యేయంగా, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. మన చుట్టూ ఉన్న సాటి మనుషులకు, సమాజానికి నిస్వార్థంగా సేవ చేయాలన్నదే వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ గారి ఆకాంక్ష అని, ఆమె ఆశయాలను నిజం చేయడమే సమాజానికి మనం ఇచ్చే నిజమైన గౌరవమన్నారు. సమాజంలో ఉన్న నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు దరిచేర్చడంతో పాటు, ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రక్తదానం అనేది సాటి మనిషికి మనం చేయగలిగే అత్యున్నత సామాజిక సేవ అని, ఆరోగ్యకరమైన ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంతటి సామాజిక ప్రయోజనకరమైన కార్యక్రమానికి ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయడం సంతోషకరమన్నారు. ?ఈ మెగా శిబిరంలో పలువురు ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే పాఠశాల సిబ్బంది, స్థానిక యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి రక్తదానం చేశారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనస్వాగతం పలికేందుకు బైకు ర్యాలీ తో యువనేత మనోజ్



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 13:** కాటన్ మహాశయుడు నిర్మాణం చేసిన ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ 197 గేట్లలో 117 గేట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వీటికి సిఎం చంద్రబాబు రూ.150 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లు నిర్మాణ శంకుస్థాపనకు వస్తున్న సిఎం చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు రైతులతో కలిసి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో అనపర్తి నుండి వేమగిరి వరకు కూటమి శ్రేణులు, రైతులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జై చంద్రబాబు,జై ప్రధాని నరేంద్ర మోడీ, జైజై నల్లమిల్లి అంటూ దారి పొడవునా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా కాటన్ బ్యారేజ్ గోదావరి డెల్టా కి జీవనాడని అటువంటి బ్యారేజ్ ను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ఇరిగేషన్ పైన జరిగిన చర్చలో ఈ విషయం ప్రస్తావించడం తదుపరి జల వనరుల శాఖ మంత్రి స్పందించి ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వగా రూ.150 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. గోదావరి డెల్టా రైతులకు ప్రయోజనం చేకూర్చుతున్న సిఎం, జల వనరుల శాఖ మంత్రి కి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

## సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**శ్రీ సత్యసాయి జిల్లాలో రాష్ట్ర సమాచార కమిషనర్ సుడిగాలి పర్యటన**

**హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, గోరంట్లలో ఆకస్మిక తనిఖీలు**

**రాష్ట్ర సమాచార కమిషనర్ జి. ఆదెన్న**





**అంకుశం ప్రతినిధిపుట్టపర్తి, జూలై 13:** ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం ఒక కీలక సాధనమని, దీని అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ జి. ఆదెన్న హెచ్చరించారు. సోమవారం ఆయన శ్రీ సత్యసాయి జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా ఆకస్మిక సుడిగాలి పర్యటనలు నిర్వహించి, ఆర్టీఐ దరఖాస్తుల స్వీకరణ, సకాలంలో వాటి పరిష్కారం మరియు పెండింగ్ వివరాలను తనిఖీ చేశారు. తన పర్యటనలో భాగంగా కమిషనర్ తొలుత హిందూపురం నగరంలోని మున్సిపల్ కార్యాలయం, ఎంజీఎం ఉన్నత పాఠశాల, ఉప రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించారు. అనంతరం పుట్టపర్తిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, ఐసిడిఎస్ కార్యాలయం, డ్వామా కార్యాలయం, ట్రెజరీ కార్యాలయాలతో పాటు గోరంట్ల మండలం పెడబల్లి, ధర్మవరం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్లు 18(3), 18(4), మరియు 19(8)(ఎ) కింద ఈ తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టం–2005 లోని సెక్షన్ 4(1)(ఎ) ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయం పాటించాల్సిన శాసనబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించడంలో ప్రాథమికంగా వైఫల్యం చెందారు. కార్యాలయాల్లో ప్రజలకు స్పష్టతనిచ్చే 'సిటిజన్ చార్టర్' (పౌర చార్టర్)బోర్డులను ప్రదర్శించలేదు. దరఖాస్తుదారులకు అవసరమైన ప్రజా సమాచార అధికారి (పీఐఓ), మొదటి అప్పిలేట్ అధికారి (ఎఫ్ఏఏ) ల పేర్లు, వారి సంప్రదింపు వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేయలేదు. పలువురు పిఐఓలకు ఆర్టీఐ చట్టంపై కనీస అవగాహన లోపించినట్లు కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ షోకాజ్ నోటీసులు అందిన 15 రోజులలోపు సంబంధిత అధికారులు కమిషన్‌కు సంతృప్తికరమైన వివరణ సమర్పించాలని రాష్ట్ర సమాచార కమిషనర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా వివరణ ఇవ్వడంలో విఫలమైతే, తదుపరి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రథమ అప్పీల్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏపీఐఓ) చట్టంలోని నిబంధనలపై, దరఖాస్తుల పరిష్కారంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేస్తూ ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సింగపూర్ ఫిడే చెస్ టోర్నీల్లో విజయవాడ చిన్నారి రాగ్వికకు డబుల్ మెడల్స్

**అండర్–8 బాలికల విభాగంలో ర్యాపిడ్‌లో రజతం.. స్టాండర్డ్‌లో కాంస్యం**



**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధివిజయవాడ: జూలై 13** విజయవాడకు చెందిన ఎనిమిదేళ్ల చెస్ క్రీడాకారిణి యెర్నేని రాగ్వికా ప్రతిష్టాత్మక సింగపూర్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్లలో రెండు పతకాలు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. అండర్–8 బాలికల విభాగంలో జరిగిన సింగపూర్ ఫిడే రేటింగ్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్లో రజత పతకాన్ని, సింగపూర్ ఫిడే రేటింగ్ స్టాండర్డ్ చెస్ టోర్నమెంట్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుని తన ప్రతిభను చాటుకుంది. విజయవాడ సమీపంలోని తాడిగడప తులసీనగర్‌లోని నెక్స్ట్ జెన్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్న రాగ్వికా, చిన్న వయసులోనే అంతర్జాతీయ వేదికపై రాణిస్తూ రాష్ట్రంలోని ప్రతిభావంతులైన యువ చెస్ క్రీడాకారిణులలో ఒకరిగా గుర్తింపు పొందింది. ఈ ద్విపతక విజయం ఆమె కృషి, పట్టుదల, క్రమశిక్షణతో కూడిన సాధనకు నిదర్శనంగా నిలిచింది. చెస్ కోచ్‌లు బండారు మహాలక్ష్మి, కనగర్ల గుణశేఖర్ల శిక్షణలో రాగ్వికా చెస్‌లో మెళకువలు నేర్చుకుంటోంది. ఆమె అంతర్జాతీయ విజయాల వెనుక వారి మార్గదర్శకత్వం, అంకితభావంతో కూడిన శిక్షణ కీలక పాత్ర పోషించిందని పలువురు అభిప్రాయపడ్డారు. రాగ్వికా సాధించిన ఈ విశిష్ట విజయాన్ని పురస్కరించుకుని కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎం.వి. బసవేశ్వరరావు సోమవారం మచిలీపట్నంలోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తన ఛాంబర్‌లో ఆమెను, ఆమె కోచ్‌లను, తండ్రి యెర్నేని రత్నప్రసాద్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బసవేశ్వరరావు మాట్లాడుతూ, చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో రెండు పతకాలు సాధించడం గొప్ప విజయమని కొనియాడారు. రాగ్వికా సాధించిన విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కోచ్‌ల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని రాగ్వికకు శుభాకాంక్షలు తెలిపారు

## టీటీడీ ఎస్వీ గోశాలకు మగ గుర్రం విరాళం



**అంకుశం న్యూస్ తిరుమల జూలై 13** మదురైకు చెందిన భక్తుడు శ్రీ వడివేలు ముగంధన్ సోమవారం టీటీడీ ఎస్వీ గోశాలకు ఒక మగ గుర్రాన్ని విరాళంగా అందజేశారు. ఈ గుర్రానికి అవసరమైన శిక్షణ పూర్తి చేసిన అనంతరం, శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి సేవలో వినియోగించనున్నారు. సోమవారం ఉదయం దాత ఈ గుర్రాన్ని టీటీడీ ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏ.వి.ఎన్. శివకుమార్ కు అప్పగించారు. తాజాగా ఎస్వీ గోశాలలో విరాళం ఇచ్చిన గుర్రంతో కలుపుకుని 5 గుర్రాలు ఉన్నట్లు గోశాల డైరెక్టర్ డా. ఏ.వి.ఎస్. శివకుమార్ తెలియజేశారు.